మద్యపానం, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు డీసీపీ జయరామ్, రామస్వామియాదవ్ తదితరులు

మాదాపూర్ జోన్ అదనపు డీసీపీ జయరామ్

రాయదుర్గం: మద్యపానం, మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని మాదాపూర్ జోన్ అదనపు డీసీపీ ఎస్ జయరామ్ పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం గచ్చిబౌలిలోని కార్యాలయంలో గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యంపై అందరూ దృష్టి పెట్టాలని సూచించారు. పొగాకు, పొగాకు ఉత్పత్తుల వినియోగంతో మనదేశంలో లక్షలాది మంది మృత్యువాత పడుతున్నారన్నారు. నిత్యం నడక, వ్యాయామం, మెడిటేషన్, యోగా, నడక మొదలైనవి కనీసం 40 నిమిషాలు చేయాలని సూచించారు. తాజా ఆకుకూరలు, సీజనల్ పండ్లు, పాలు, పాల ఉత్పత్తులు, చేపలు, గుడ్లు, తృణ ధాన్యాలు, డ్రైఫ్రూట్స్, పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వాణిసాంబశివరావు, జనార్దన్, పాలంశ్రీను, ధర్మసాగర్, జీవి రావు, బాలన్న, నేమాని విశ్వశాంతి, జాకీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

సంస్కృతిని పరిరక్షించాలి

రాయదుర్గం: సాంస్కృతిక వైవిధ్యాన్ని పరిరక్షించాలని యునెస్కో న్యూఢిల్లీ సాంస్కృతిక శాఖాధిపతి జున్హిహాన్ పేర్కొన్నారు. హెచ్‌సీయూలో వీసీ బీజేరావు పర్యవేక్షణలో స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ ఆధ్వర్యంలో 'భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల సందర్భంలో సాంస్కృతిక వైవిధ్యాన్ని నిలబెట్టుకోవడం' అనే అంశంపై ఆన్‌లైన్ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్కృతిని కాపాడడంలో సమయోచితంగా, సందర్భోచితంగా వ్యవహరించాలన్నారు. సదస్సులో సాహిత్యం, భాషాశాస్త్రం, అనువాదం, జానపద సంస్కృతి అధ్యయనాలకు చెందిన ప్రముఖులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. సాంకేతిక పరిశ్రమలలో వైవిధ్యం, సమగ్ర రూపకల్పన సూత్రాలను ప్రోత్సహించడం అత్యవసరమన్నారు. కార్యక్రమంలో హ్యూమానిటీస్ స్కూల్ డీన్ ప్రొ.ప్రభాకర్‌రావు, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ సీసీఆర్‌టీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాహుల్‌కుమార్, హెచ్‌సీయూ ప్రొఫెసర్ ప్రమోద్‌నాయర్ ప్రసంగించారు.

నేడు హనుమజ్జయంతి

ప్రత్యేక పూజలు.. లక్ష తమలపాకుల అర్చన

పటాన్‌చెరు: హనుమజ్జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని జేపీ కాలనీలోని శ్రీ పంచముఖ వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ అర్చకులు నరేశ్,ఆలయ అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభిషేకం, లక్ష తమలపాకుల అర్చన, ప్రత్యేక పూజలు,హనుమాన్ చాలీసా పారాయణం, అన్నదానం ఉంటుందని సాయంత్రం స్వామివారి పల్లకి ఊరేగింపు ఉంటుందన్నారు.భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

రామలింగేశ్వర దేవస్థానంలో...

పటాన్‌చెరు పాత టోల్‌గేట్ సమీపంలోని శ్రీ రామలింగేశ్వర దేవస్థానంలో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ అర్చకులు మహేష్, గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం తెల్లవారుజామున స్వామివారికి పంచామృత అభిషేకం సిందూరపూజ, ఆకు పూజ ఉంటుందన్నారు. మధ్యాహ్నం అన్నదానం జరుగుతుందని తెలిపారు.

గుంతల రోడ్లతో అవస్థలు

నిబంధనలు గాలికొదిలి అడ్డగోలుగా మరమ్మతు పనులు


మియాపూర్‌లో గుంతలుపడ్డ రోడ్లు

మియాపూర్: గుంతలరోడ్లతో ప్రజల అవస్థలు చెప్పనలవికాదు. రోడ్ల మరమ్మతులకు కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా ఫలితం లేదు. రోడ్లపై అడుగడుగునా గుంతలు దర్శనమిస్తూనే ఉన్నాయి. రోడ్ల నిర్మాణం, మరమ్మతుల సమయంలో నాణ్యత పాటించకపోవడంతో మూణ్నాళ్లకే గుంతలు ఏర్పడుతున్నాయని రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని వెంటనే బాగు చేయాలని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- మియాపూర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో లక్షల రూపాయలు వెచ్చించి ప్రధాన రోడ్లలో గుంతలు పూడ్చించారు.
- అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు తూతూ మంత్రంగా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- మరమ్మతు పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో వాహనాల రాకపోకలకు మూడురోజులకే కంకర తేలుతోంది. దీంతో జారి పడే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు.

పనుల్లో నిబంధనలు బేఖాతరు..

- కాంట్రాక్టర్లు ట్రాక్టర్‌లు, ఇతర వాహనాలలో తారు, కంకర మిశ్రమాన్ని తెచ్చి గుంతలు పూడ్చేస్తున్నారు.
- చదును చేయడానికి బూట్లు లేదా చెప్పులతో, పార సహాయంతో అడ్డదిడ్డంగా చదును చేసి వదిలేస్తున్నారు.
- గుంతలలో నీళ్ల ఉన్నా కూడా అలాగే కంకర మిశ్రమాన్ని వేస్తున్నారు. దీంతో వర్షం వచ్చినా,భారీ వాహనాలు వాటిపై నుండి వెళ్లడంతో గుంతలు కంకర తేలిపోతున్నాయి.
- ట్రాక్టర్‌లో ఉన్న కంకర మిశ్రమాన్ని కార్మికులు ఖాళీ చేస్తున్నారే తప్ప ఎలాంటి నియమ నిబంధనలు పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనకు రాకపోవడం, పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ పనుల నిమిత్తం సీసీ రోడ్లను సైతం మధ్యలో తవ్వి పనులు అయ్యాక సరైన రీతిలో మరమ్మతులు చేయకపోవడంతో రోడ్లు గుంతలుపడుతున్నాయి. సిమెంట్, ఇసుక, కంకర ఒకేసారి కలిపి ఆ గుంతలను పూడ్చివేస్తున్నారు. దీంతో సిమెంట్ రోడ్లు సైతం కొద్దిరోజులకే పాడవుతున్నాయి.





'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారి సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది.'కనెక్ట్ జాయ్' పేరిట స్వీయ అభివృద్ధి కోసం ఆహ్లాదకరమైన, సృజనాత్మకత అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

ఆచార్య దార్ల సేవలు శ్లాఘనీయం


రాములుకు నియామకపత్రాన్ని అందిస్తున్న ప్రభాకర్‌రావు, దార్ల వెంకటేశ్వరరావు

రాయదుర్గం: హెచ్‌సీయూ తెలుగు విభాగాధిపతిగా ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు సేవలు శ్లాఘనీయమని హెచ్‌సీయూ మానవీయ శాస్త్రాల విభాగాల పీఠాధిపతి ఆచార్య జంధ్యాల ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పదవీ విరమణ సందర్భంగా ఆయనకు అభినందన సమావేశాన్ని నిర్వహించి ఆయనను ఘనంగా సత్కరించి మెమెంటోను అందించారు. ఆచార్య గోనానాయక్, ఆచార్యులు విజయలక్ష్మీ, వంగరి త్రివేణి, డాక్టర్ బి తిరుపతి, డాక్టర్ భుజంగ రెడ్డి, విజయ్‌కుమార్, లత, స్వాతిదయాకర్ ప్రసంగించారు.

తెలుగుశాఖ నూతన అధ్యక్షులుగా ఆచార్య రాములు

హెచ్‌సీయూ తెలుగుశాఖ నూతన అధ్యక్షులుగా ఆచార్య పిల్లలమర్రి రాములు నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు,ఆచార్యులు జంధ్యాల ప్రభాకర్‌రావు, దార్ల వెంకటేశ్వరరావు ఘనంగా సత్కరించారు.

గణేష్‌గడ్డ ఆలయ ఇన్‌చార్జ్ ఈఓగా లావణ్య

పదవీ విరమణ చేసిన ఈఓ మోహన్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం రుద్రారం గణేష్ గడ్డ దేవస్థాన ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో జూబ్లీహిల్స్ శ్రీనగర్ కాలనీలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈఓ లావణ్య గణేష్‌గడ్డ దేవస్థానం ఇన్‌చార్జీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ జూనియర్ అసిస్టెంట్లు మల్లికార్జున్, ఈశ్వర్, ఆలయ అర్చకులు పదవి విరమణ పొందిన ఆలయ ఈఓ మోహన్ రెడ్డిని అదేవిధంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జీ లావణ్యను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్ స్వామి, చంద్రశేఖర్, సతీష్ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం


స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జెపీ కాలనీలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవంను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కార్పొరేటర్, ఆలయ ధర్మకర్త మెట్టుకుమార్ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఖాతాలో నార్సింగి మున్సిపాలిటీ


నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లను అభినందించిన రంజిత్‌రెడ్డి తదితరులు

- చైర్‌పర్సన్‌గా నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా విజయ్‌బాబు
- చైర్‌పర్సన్, చైర్మన్లను అభినందించిన గడ్డం రంజిత్‌రెడ్డి

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గం నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ పరమైంది. ఇప్పటికే బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ కోటాలో చేరగా శుక్రవారం జరిగిన నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ ఖాతాలో చేరింది. నార్సింగి మున్సిపాలిటీలో గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరటం, ఓ స్వతంత్ర కౌన్సిలర్, ఇద్దరు బీజేపీ కౌన్సిలర్‌లు మద్దతు తెలపటంతో ఈనెల 18వ తేదీన 18 మంది సభ్యులకు గాను 14 మంది సభ్యుల బలంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లపై పెట్టిన అవిశ్వాసం నెగ్గటంతో వారు పదవీచ్యుతులు అయ్యారు. కొత్త చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకునేందుకు జిల్లా కలెక్టర్ శుక్రవారం తేదీ నిర్ణయించారు. దీంతో ముందు నుంచి అనుకున్నట్టుగానే నార్సింగి మున్సిపాలిటీ కొత్త చైర్‌పర్సన్‌గా మంచిరేవుల 10వ వార్డు కౌన్సిలర్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, కోకాపేట 3వ వార్డు కౌన్సిలర్ గోపాల విజయ్‌బాబును వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఎన్నిక సజావుగా సాగింది. అనంతరం 12.20 గంటలకు వారితో ప్రమాణస్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఫహీం ఖురేషి, రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, పీసీసీ అధికారి ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్‌లు వారిని అభినందించారు.

అమతుర్ రెహ్మాన్‌మైమూనకు పీహెచ్‌డీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని పరిశోధక విద్యార్థినికి పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ పరిశోధక విద్యార్థిని అమతుర్ రెహ్మాన్‌మైమూనా 'సైకలాజికల్ వెల్ బీయింగ్, రెసిలెన్స్ అండ్ ఎమోషనల్ అండ్ సోషల్ ఇంటిలిజెన్స్ అమాంగ్ ఇన్ సర్వీస్ టీచర్స్' అనే అంశంపై భోపాల్‌లోని కాలేజ్ ఆఫ్ టీచర్(సీటీఈ) అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇంద్రజిత్‌దత్తా పర్యవేక్షణలో, సీటీఈ ఔరంగాబాద్ ఫ్యాకల్టీ డాక్టర్ బద్రుల్ ఇస్లామ్, భోపాల్ సీటీఈ ఫ్యాకల్టీ డాక్టర్ వి. సక్కీర్ సహ పర్యవేక్షకుల సహకారంతో పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు.

నివాళి


అర్జున్‌గౌడ్ (ఫైల్)

శేరిలింగంపల్లి: రాజేంద్రనగర్ సమితి మాజీ అధ్యక్షులు బండకింది అర్జున్ గౌడ్ (86) అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. శేరిలింగంపల్లి గోపీనగర్‌లో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శేరిలింగంపల్లి పరిసర ప్రాంత నాయకులు, కాలనీ వాసులు పెద్ద ఎత్తున వచ్చిన ఆయనకు నివాళులర్పించారు.

చెస్ అంటే నాకు ఇష్టం..

మంత్రి కొండా సురేఖ


చిన్నారి చెస్ క్రీడాకారిణి ఇషానీతో మంత్రి కొండాసురేఖ

హఫీజ్‌పేట్: చెస్ అంటే తనకు చాలా ఇష్టమని, ఈ ఆటపై తనకు మంచి అవగాహన ఉందని మంత్రి కొండా సురేఖ అన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఓ అపార్టుమెంట్‌లో శుక్రవారం ఇషానీ చక్కిలం అనే చిన్నారి వందకుపైగా చెక్‌మేట్-ఇన్-వన్ పజిల్ ఇన్‌ను 9.23 నిమిషాలలో పూర్తి చేసి లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో గుర్తింపు సాధించింది. దీన్ని అధికారికంగా గుర్తించాల్సి ఉంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి సురేఖ హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆత్మవిశ్వాసం, నమ్మకంతో వ్యవహరిస్తే ఎవరికి వారు అన్ని రంగాల్లో విజయం సాధిస్తారన్నారు. తాను చిన్నప్పుడు స్పోర్ట్స్, గేమ్స్, ఎస్సే రైటింగ్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీలలో ఉత్సాహంగా పాల్గొనేదాన్నని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలను చదివించడమే కాకుండా వారికిష్టమైన రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, చిన్నారి ఇషానీ తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

'అగాధంలోంచి ఆకాశంలోకి' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు

మాదాపూర్: తెలివితేటలు, సృజనాత్మకత ఉంటే డబ్బు దానంతట అదే వస్తుందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. శుక్రవారం మాదాపూర్‌లోని మహేంద్ర టెక్ ఆడిటోరియంలో టి.ఎస్.మనోహరన్, వి.పట్టాభిరామ్ రచించిన 'అగాధంలోంచి ఆకాశంలోకి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలివి, జాగరూకత, నీతి, నిజాయతీ, పారదర్శకతను పాటిస్తే ప్రతి ఒక్కరూ జీవితంలో ఉన్నత స్థాయిని పొందవచ్చన్నారు. కుటుంబం నుంచి సంస్థ వరకు డబ్బుల విషయంలో నిజాయతీగా ఉండాలన్నారు. పతనం అంచులో ఉన్న సత్యం సంస్థను నిలబెట్టిన తీరును వివరించిన ఈ పుస్తకాన్ని ఆవిష్కరించడం సంతోషాన్ని కలిగించిందన్నారు. సెంట్రల్ విజిలెన్స్ మాజీ కమిషనర్ కేవీ చౌదరి, స్టాండింగ్ ఎక్స్‌టర్నల్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ సభ్యుడు టి.ఎన్ మనోహరన్ పాల్గొన్నారు.

సిటీ వేదికగా స్టైల్ అప్..



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని నల్లగండ్ల అపర్ణ నియో మాల్ వేదికగా ఆదిత్య బిర్లా ఫ్యాషన్ ఆధ్వర్యంలోని 'స్టైల్ అప్' నూతన స్టోర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టైల్ అప్, పాంటలూన్స్ సీఈఓ సంగీత మాట్లాడుతూ.., ఫ్యాషన్-ఫార్వర్డ్ షాపింగ్ కేంద్రంగా నిలుస్తున్న హైదరాబాద్‌లో అధునాతన ఫ్యాషన్ హంగులను అందించడం సంతోషంగా ఉందని అన్నారు. వినూత్నమైన జెన్-జెడ్, జెన్ ఆల్ఫా ఫ్యాషన్‌లను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. దేశంలో 30వ ఫ్యాషన్ వేదికగా ఈ స్టోర్‌ను ఆవిష్కరించామన్నారు.

పదవీ విరమణ పొందిన నెలలోనే పింఛను పత్రాలు

పటాన్‌చెరు టౌన్: ప్రయాస్ పథకంలో భాగంగా పదవీ విరమణ పొందిన నెలలోనే, చందాదారులకు పింఛను పత్రాలను మంజూరు చేస్తుందని ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరులోని ప్రాంతీయ కార్యాలయంలో మే నెలలో భాగంగా 35 మందికి పింఛన్లు మంజూరు చేయగా అందులో 14 మందికి పింఛను మంజూరు పత్రాలను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ విశాల్ అగర్వాల్ మాట్లాడుతూ... పత్రాలు సకాలంలో అందజేస్తే, వారికి రిటైర్ అయిన నెలలోనే పింఛను మంజూరు పత్రాలను అందజేయడానికి తమ సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పి.ఎఫ్ కమిషనరు శ్రీలక్ష్మి, అకౌంట్స్ అధికారి మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

మియాపూర్: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ దశరథ్ తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ ఆదిత్యనగర్‌కు చెందిన సయ్యద్ ఇస్మాయిల్(45) బైక్ యాక్సిడెంట్ కారణంగా రెండేళ్ల క్రితం మతిస్థిమితం కోల్పోయాడు. ప్రమాదం జరిగిన తర్వాత మెదక్ జిల్లా నారాయణఖేడ్ నుండి వచ్చి ఆదిత్యనగర్‌లో ఉంటున్నారు. ఫిబ్రవరి 25వ తేదీ ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో స్నేహితుల వద్ద, బంధువుల ఇళ్లల్లో విచారించినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు మియాపూర్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మరో ఘటనలో..

పటాన్‌చెరు టౌన్: పెయింటింగ్ పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సోమేశ్వరి కథనం ప్రకారం...అమీన్‌పూర్ పరిధిలోని శ్రీవాణి నగర్ కాలనీకి చెందిన బాలాజీ(54) పెయింటర్. గురువారం ఉదయం రోజులానే పెయింటింగ్ పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బాలాజీ కోసం తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి అదృశ్యంపై కుమారుడు విజయ్ కుమార్ గురువారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శేరిలింగంపల్లి: విద్యుత్ సంబంధిత మరమ్మతుల కారణంగా దూబే కాలనీ, లేక్ వ్యూ, లక్ష్మీవిహార్ ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకటనారాయణ రెడ్డి తెలిపారు.

- 11 కేవీ దూబే కాలనీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దూబే కాలనీ, ఆదర్శనగర్, నెహ్రూనగర్, గోపీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.
- 11 కేవీ లేక్ వ్యూ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.30గంటల వరకు నల్లగండ్ల, నల్లగండ్ల హుడా కాలనీ, డీ మార్ట్ బ్యాక్ సైడ్, మెడిప్లస్ లైన్‌లలో..
- 11 కేవీ లక్ష్మీవిహార్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 5 గంటల వరకు లక్ష్మీవిహార్ ఫేజ్-1, ఫేజ్-2 కాలనీలు, డాక్టర్స్ కాలనీ, నల్లగండ్ల విలేజ్‌లలో విద్యుత్ ఉండదని ఏఈ తెలిపారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: గచ్చిబౌలి జేవీజీహిల్స్ 11 కేవీ ఫీడర్ పరిధిలో..శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గాయత్రి లేఅవుట్, కాంతివనం, సెంట్రల్ పార్క్ ఫేజ్-2, శిల్పావ్యాలీ, మాధవహిల్స్, జేవీజీహిల్స్, రాజరాజేశ్వరీ ఫీడర్ పరిధిలో..రాజరాజేశ్వరీనగర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని కొండాపూర్ ఏఈ రాజశేఖర్ రెడ్డి తెలిపారు

వైట్ ఫీల్డ్ పరిధిలో..

వైట్ ఫీల్డ్ సబ్‌స్టేషన్ పరిధిలో.. శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంజయ్యనగర్, రాజీవ్‌నగర్, వడ్డెర బస్తీ, రోలింగ్‌హిల్స్, బాబుఖాన్ లేన్ పరిసరాలలో విద్యుత్ ఉండదని ఏఈ కిశోర్ తెలిపారు.

చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

హఫీజ్‌పేట్: చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- ఆర్టీసీ కాలనీ (మైత్రీనగర్) ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు ల్యాండ్‌మార్క్ రెసిడెన్సీ, ఆర్టీసీ కాలనీ, జెనిసిస్ స్కూల్, సప్తగిరి ఎన్‌క్లేవ్, తులసిరాం చాంబర్స్ ప్రాంతాలలో..
- ఆల్విన్‌కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 02.00 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు మైత్రీనగర్ ఫేజ్-1, మదీనాగూడ విలేజ్, దైనిష్ అపార్ట్‌మెంట్, కల్కి హైట్స్, జీ హబిటాట్, కల్లం అంజిరెడ్డి స్కూల్, పైప్‌లైన్ రోడ్డు ఏరియాలలో..

హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలో..

- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు హఫీజ్‌పేట్ మెయిన్ రోడ్డు, ఓల్డ్ హఫీజ్‌పేట్, శ్రీనగర్, యూత్ కాలనీ, దేవి హోమ్స్, జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయం, రైల్వే స్టేషన్ ఏరియాలలో..
- మైత్రీనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఆల్విన్ కాలనీ మెయిన్ రోడ్డు, జనప్రియ ఫేజ్ 1,2,3,4,5,6, జనప్రియనగర్, భాను టౌన్‌షిప్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ ఇంద్రసేనారెడ్డి ప్రకటనలో తెలిపారు.

తారానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

- ఆర్టీసీ కాలనీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు చందానగర్ హుడా కాలనీ కొంతభాగం ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సుమన్ పేర్కొన్నారు.
- వెజిటేబుల్ (లింగంపల్లి) ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు లింగంపల్లి మటన్ మార్కెట్, పోలీస్ క్వార్టర్స్, కానుకుంట, వెజిటేబుల్ మార్కెట్, ఎస్ఎం లేఅవుట్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

హఫీజ్‌పేట్: వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

- పీజేఆర్ కాలనీ (మైత్రీనగర్) ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డు నంబర్లు 1,3,5,7,10,12 వీధులలో..
- భవానీపురం ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు భవానీపురం, రెడ్డి కాలనీ, శంకర్‌నగర్ విల్లాస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మియాపూర్‌లో..

మియాపూర్: ప్రశాంత్‌నగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 2 గంటల నుండి 4.30ల వరకు ప్రశాంత్‌నగర్, మయూరినగర్, సాయిబాబా టెంపుల్, వాటర్ ట్యాంక్ లైన్, ఓల్డేజ్ హోమ్,జీఎల్ఆర్ కమాన్ ఏరియా ప్రాంతాలు, ఏజీ స్పోర్ట్స్ ప్రాంతం, మయూరినగర్ ఓల్డేజ్ హోమ్ రోడ్డు, కోరుకొండ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ హరీష్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: గౌలిదొడ్డి ఫీడర్ పరిధిలో..ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గౌలిదొడ్డి, జర్నలిస్ట్ కాలనీ, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఓల్డ్ గచ్చిబౌలి, క్విట్‌లాండ్స్ విల్లాస్, హిమగిరి హస్పిటల్, గచ్చిబౌలి మెయిన్ రోడ్డు ఏరియాల్లో..


- పద్మశ్రీ గార్డెన్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు పద్మశ్రీ గార్డెన్, గౌలిదొడ్డి ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ వేణుగోపాల్ తెలిపారు.

పోషకాహారం తయారీపై శిక్షణ


మహిళలకు పోషకాహారం తయారీని చూపిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని కాలేజీ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ ఫుడ్ అండ్ న్యూట్రిషన్ విభాగం ద్వారా ఎస్సీ సబ్‌ప్లాన్ కింద పండ్లు, కూరగాయల జోడింపు ద్వారా పోషకాహారం ఎలా తయారు చేయాలో మహిళలకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఇందులో కార్వాన్‌లోని జాఫర్‌గూడ్, ఎల్‌బీ నగర్‌లోని అల్వాపూరి కి చెందిన 40 మంది మహిళలకు ఇందులో శిక్షణ ఇచ్చారు. కమ్యూనిటీ సైన్స్ అసోసియేట్ డీన్ డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్ని మాట్లాడుతూ మహిళలు వ్యాపారవేత్తలుగా మారడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ మహిళా అభివృద్ధి సొసైటి అర్బన్ న్యూట్రిషన్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎల్ భవాని మాట్లాడుతూ రోజువారి జీవనంలో పోషకాహారం, శుభ్రత ,వ్యక్తిగత ఆరోగ్యం ఆవశ్యకత గురించి వివరించారు.

పదవీ విరమణ సత్కారం


పదవీ విరమణ చేసిన ఉద్యోగులతో కొండాపూర్ 8వ బెటాలియన్ కమాండెంట్ సన్నీ

గచ్చిబౌలి: పదవీ విరమణ చేసిన ఉద్యోగులను కొండాపూర్ టీఎస్ఎస్‌పీ 8వ బెటాలియన్ కమాండెంట్ సి.సన్నీ సన్మానించారు. శుక్రవారం కొండాపూర్ బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఉద్యోగులతో మాట్లాడారు. భవిష్యత్‌లో సహాయ సహకారాలందిస్తామని పేర్కొన్నారు. ఆర్ఎస్ఐలు రాంమోహన్, ప్రభాకర్, జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణలు పదవీ విరమణ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ బి.వి.రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్లు రాంబాబు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఎంటీవీ లో న్యూమీ..

సాక్షి సిటీబ్యూరో: ప్రముఖ అంతర్జాతీయ మహిళల దుస్తుల బ్రాండ్ న్యూమీ యువత, సంగీత అభిమానులను అలరించే ఎంటీవీలో తళుక్కుమంది. ఈ విషయాన్ని బ్రాండ్ ప్రతినిధులు సమావేశంలో తెలిపారు. కొండాపూర్‌లోని శరత్ మాల్లో న్యూమీ నూతన షోరూంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎంటీవీలో ప్రసారం అవుతున్న స్ప్లిట్ విల్లా కార్యక్రమంలో తమ బ్రాండ్ దుస్తులు కనువిందు చేస్తున్నాయన్నారు. నగరంలోని అతిపెద్ద స్టోర్ తో పాటు ఈ ఏడాది చివరికల్లా దేశవ్యాప్తంగా 20 కొత్త స్టోర్స్ నెలకొల్పనున్నామన్నారు.